# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY



**విలేఖరులు కావలెను...**

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954



Cerculated by Hyderbad, Nalgonda, Nizambad, Warngall, Khammam, Rangareddy, Kamareddy, Medak, Adilabad,Manchiryal, KarimNagar

పబ్లిషర్: తెలంగాణ    సంపుటి : 1    సంచిక : 09  ఆదివారం 18- 8-2024    పేజీలు : 4    వెల రూ.- 3


## ప్రధానితో చంద్రబాబు భేటీ..

### అమరావతి, పోలవరంపై చర్చ!



దిల్లీ: **మనవెలుగు** ఏపీ సీఎం చంద్రబాబు దిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధానితో చర్చించినట్టు సమాచారం.పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును భరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలో.. ఆయా నిధుల మంజూరుపై ప్రధానితో మాట్లాడినట్లు తెలుస్తోంది.రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం చేయనున్నట్లు ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ నిధుల విడుదలపైనా చంద్రబాబు వాకబు చేసినట్లు సమాచారం. అంతే కాకుండా వెనకబడిన జిల్లాల జాబితాలో ఉన్న 8 జిల్లాలకు ఆర్థికసాయం కింద నిధులు విడుదల చేయాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది.

## 19 సంస్థలతో రూ.31,500 కోట్ల విలువైన ఒప్పందాలు

### విదేశీ పర్యటనపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ



హైదరాబాద్,ఆగస్ట్17 **మనవెలుగు** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు 19 సంస్థలతో రూ.31,500 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పెట్టుబడుల ద్వారా 30,750 ఉద్యోగాలు వచ్చే అవకాశముందన్నారు. ‘దక్షిణ కొరియాలో దాదాపు 12 సంస్థలతో చర్చలు జరిపాం. ఏఐ, ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులపై చర్చించాం. మూసీ పునరుజ్జీవం కోసం కొన్ని అధ్యయనాలు చేశాం. మూసీ సుందరీకరణపై ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడితో చర్చించాం. రాష్ట్రంలో బయోడిజైర్ సిటీని ఏర్పాటు చేయాలని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని కోరాం‘ అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## మోడీ పేరు చెబితేనే భయపడుతున్న రేవంత్

- మహిళా కమిషన్ ఎదుట హాజరవుతా
- క్షమాపణలు చెప్పినా నోటీసులు ఇచ్చారు
- మహిళలపై జరిగిన అక్రమాలను నివేదిస్తా
- బిజెపిలో కలవడమే రేవంత్ తదుపరి లక్ష్యం
- రుణమాఫీ పూర్తిగా జరిగే వరకు నిలదీస్తూనే ఉంటాం
- మీడియా సమావేశంలో కెటిఆర్ హెచ్చరిక




హైదరాబాద్,ఆగస్ట్17 **మనవెలుగు**
తెలంగాణ మహిళా కమిషన్ జారీ చేసిన నోటీసులపై కేటీఆర్ స్పందించారు. ఈ నెల 24న కమిషన్ ఎదుట హాజరవుతానని తెలిపారు. గత ఎనిమిది నెలలుగా కాంగ్రెస్ పాలనలో జరిగిన దురాగతాల వివరాలను కమిషన్‌కు అందజేస్తానని చెప్పారు. తాను బహిరంగ క్షమాపణలు చెప్పిన తర్వాత కూడా నోటీసులు ఇచ్చారన్నారు. మా మహిళా ఎమ్మెల్యేలపై సీఎం, నేతలు వ్యాఖ్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు హాజరుకావాలని కేటీఆర్‌కు మహిళా కమిషన్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు సౌకర్యంపై కేటీఆర్ మాట్లాడుతూ.. ’బస్సుల్లో కుట్లు అల్లికలే కాదు, అవసరమైతే బ్రేక్ డ్యాన్సులు చేసుకున్న మాకు అభ్యంతరం లేదు’ అంటూ వ్యాఖ్యానించారు.అలాగే రేవంత్‌రెడ్డిపై కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ తర్వాతి రాజకీయ మజిలీ బీజేపీయేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీజేపీలో ఆయన తనబృందంతో చేరడం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అంటే ఎందుకు భయమో అసలు కారణాన్ని రేవంత్‌రెడ్డి ఈ మధ్యనే తన సన్నిహితుల వద్ద బయటపెట్టుకున్నారని కేటీఆర్ అన్నారు.

## బోర్డు తిప్పేసిన మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ

### కోట్లు వసూలు చేసి ఆఫీస్కు తాళం




హైదరాబాద్,ఆగస్ట్17 **మనవెలుగు** మాదాపూర్‌లో మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. అయ్యప్ప సొసైటీలో ఫైర్డే అప్ కన్సల్టెన్సీ కంపెనీ దాదాపు 200 మంది నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసింది. ఒక్కొక్కరి నుంచి రూ.1.50లక్షల చొప్పున వసూలు చేసి.. శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించింది. శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్ ఇప్పించినట్టు నమ్మించి జీతాలు ఇవ్వకుండా మోసం చేసింది. కార్యాలయానికి ఉన్న పళంగా తాళం వేయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు శనివారం మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కంపెనీకి బెంగళూరు, విజయవాడలో కేంద్రాలు ఉన్నట్టు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మాదాపూర్ పోలీసులు తెలిపారు.

## 17వేల కోట్లతో రుణ మాఫీ పూర్తి అవుతుందా?

- రుణమాఫీకి ఎగనామం పెట్టి ఎదురుదాడి చేస్తారా
- సిఎం రేవంత్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ విమర్శలు



హైదరాబాద్,ఆగస్ట్17 అభ్యుదయం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలి దొంగే దొంగ అన్నట్లుగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీకి ఎగనామం పెట్టి మొత్తం రుణమాఫీ చేసినట్లు ఫోజులు కొడుతున్నారని మండిపడ్డారు. ‘పాక్షికంగా చేసిన.. తప్పైంది అని క్షమాపణ చెప్పు. నోరు బిగ్గరగా చేసినంత మాత్రాన నిన్ను బీఆర్ఎస్ వదిలి పెట్టదు. కేబినెట్‌లో 31వేల కోట్లు అన్నారు. బ్జడెట్‌లో రూ.26వేల కోట్లు పెట్టారు. తీరా రూ.17933 కోట్లు మాత్రమే ఇచ్చి 22లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు.రూ.14వేల కోట్లు కోత పెట్టి రుణమాఫీ పూర్తి అయ్యింది అంటున్నారు.

## పునాటి నరసింహారావుకు ఇండియన్ పోలీస్ మెడల్



హైదరాబాద్:మనవెలుగు ఉద్యోగంలో నిబద్ధత కలిగి ఉండటం.. ఏ విభాగంలో పని చేసినా.. అక్కడ అత్యుత్తమ సేవలందించడం.. డిపార్ట్ మెంట్‌లో ఉన్నతాధికారుల చేత మన్ననలు అందుకోవడం ఆ పోలీసు అధికారికి మొదటి నుంచి ఉన్న ట్రాక్ రికార్డ్.అందుకే ఇప్పుడు ఇండియన్ పోలీస్ మెడల్ ను అందు కుని మరోసారి తన వర్క్‌లో సిన్సియారిటీని చూపించారు. ఆయన ఎవరో కాదు.. హైదరాబాదులోని మియాపూర్ ఏసీపీ నరసింహరావు. మియాపూర్ ఏసీపీగా పనిచేస్తున్న ఆయన ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన మెడల్‌ను అందుకున్నారు. 1995లో ఎస్సైగా విధుల్లో చేరిన ఆయన 2009లో సి.ఐగా పదోన్నతి పొందారు. వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆయన విధులు నిర్వహించారు. పోలీస్ శాఖలో ఆయన చేసిన సేవలకు గాను గతంలోనూ ఉత్తమ సేవా పతకం అందుకోగా ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్(ఐ.పి.యమ్ )కు ఎంపిక చేసింది.2021లో ఏసీపీగా పదోన్నతి పొందిన ఆయన.. ఇంటిలిజెన్స్ విభాగంలో కొంతకాలం పనిచేశారు. ప్రస్తుతం నరసింహారావు మియాపూర్ ఏసిపిగా విధుల్లో కొనసాగుతున్నారు. ఇండియన్ పోలీస్ మెడలను అందుకున్న ఆయనకు మియాపూర్ సబ్ డివిజన్ కు చెందిన పోలీసు సిబ్బంది ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.



## కమలతో డిబేట్..

### ట్రంప్ ‘తులసి’ వ్యూహం!

న్యూయార్క్:మనవెలుగు
అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి ఉపాధ్యక్షురాలు, ఇండో అమెరికన్ కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు, రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రచారంలో దూసుకువెళ్తున్నారు. ప్రచారంలో భాగంగా సెప్టెంబర్ 10న జరిగే డిబేట్‌పై ఇప్పటికే కసరత్తు మొదలైనట్లు తెలుస్తోంది.

## మైనింగ్ రంగాల్లో సింగరేణిని విస్తరించాలి

### సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, అభివృద్ధిపై భట్టి సమీక్ష



హైదరాబాద్,ఆగస్ట్17 **మనవెలుగు**
సింగరేణి ఇతర మైనింగ్ రంగాల్లో విస్తరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్గ అధికారులకు సూచించారు. అంబేద్కర్ సచివాలయంలో సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, అభివృద్ధిపై జరిగిన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి సాంప్రదాయ ఇంధన వనరులకు కాలం చెల్లుతోందని.. భవిష్యత్ అంతా విద్యుత్ బ్యాటరీలే కేంద్రంగా మారబోతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో లిథియం, అనేక మూలకాల అన్వేషణ, వాటిని వెలికితీయడంపై సింగరేణి దృష్టి సారించాలన్నారు. సింగరేణి సంస్థ తన మనుగడను కొనసాగిస్తూ ఆస్తులను, సంపదను సృష్టించుకోవాలని సూచించారు. తద్వారా రాష్ట్ర ప్రజల సంపదైన సింగరేణి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన జరుగుతు ందని డిప్యూటీ సీఎం చెప్పారు. సింగరేణి సంస్థ మెటల్స్, నాన్ మెటల్స్ మైనింగ్‌లో ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాలన్నారు. ఇందుకు అవసరమైతే ఓ కన్సల్టెన్సీని నియమించు కోవాలని అధికారులకు స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీలో భాగంగా రాష్ట్రంలో ఎ÷-లోటింగ్ సోలార్, పంప్డ్ స్టోరేజ్ పవర్ ఎ÷-లాంట్ల ఏర్పా టుకు సన్నాహకాలు చేస్తున్నట్లు అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఇందుకు సంబంధించి పూర్తి డీపీఆర్‌లు రూపొందిస్తున్నామని.. త్వరలోనూ వాటిని ప్రభుత్వానికి అందిస్తామని విక్రమార్కకు వివరించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఎప్పటినుంచి ఉత్పత్తి ఆరంభిస్తారని భట్టి ఆరా తీశారు.
సమీక్షా సమా వేశంలో ఎనర్జీ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సెక్రెటరీ కృష్ణభాస్కర్, సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ పాల్గొన్నారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
ఆదివారం 18 ఆగస్టు 2024

# సంక్షేమ కార్యక్రమాలకోసం వెంకయ్య జీవితం అంకితం చేశారు

## ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్



నెల్లూరు: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ నెల్లూరులో పర్యటించారు. శనివారం ఉదయం అక్షర విద్యాలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దంపతులకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఘనస్వాగతం పలికారు.స్వర్ణభారత్ ట్రస్టు 23వ వార్షికోత్సవ సభలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ..”సంక్షేమ కార్యక్రమాల కోసం వెంకయ్యనాయుడు జీవితం అంకితం చేశారు. గ్రామీణ భారతంలో సేవకు ఆయన అంకితమయ్యారు. సమరయోధుల కలలు నేడు సాకారమవుతున్నాయి” అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణంలో దానధర్మాలు

తిరుమల,ఆగస్ట్17: శ్రావణమాసంలో దానధర్మాలకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. ముఖ్యంగా పేద మహిళలకు వస్త్ర దానం చేస్తే శ్రావణ మాసంలో లక్ష్మీదేవి ఆశీస్సులు కలుగుతాయని నమ్మిక. అలాగే కన్నె పిల్లలను ఇంటికి ఆహ్వానించి వారికి భోజనం పెట్టడం ద్వారా శుభం జరుగుతుంది.శ్రావణ మాసం అంటే శుభ మాసం. శ్రావణ మాసాన్ని నభో మాసం అని కూడా అంటారు, నభో అంటే ఆకాశం అని అర్థం. ఈ నెలలో వచ్చే సోమవారాలు, మంగళవారాలు, శుక్రవారాలు, శనివారాలు ఎంతో పవిత్రమైనవి.

ఈ నెలలో వచ్చే ముఖ్యమైన పర్వదినాలు జంధ్యాల పౌర్ణమి, కృష్ణాష్టమి, పొలాల అమావాస్య, నాగ చతుర్థి ,నాగ పంచమి పుత్రాదా ఏకాదశి ,దామోదర ద్వాదశి ,వరాహ జయన్తి ఇలా అనేక పండుగలు వస్తాయి. శ్రావణ మాసం చంద్రుడి మాసం కూడా, చంద్రుడు మనఃకారకుడు. అంటే సంపూర్ణముగా మనస్సు మీద ప్రభావము చూపే మాసము.ఈ మాసమందు రవి సంచరించు నక్షత్రముల ప్రభావము చంద్రుని మూలకముగా మన మీద ప్రభావం చూపును. చంద్రుని చార నుంచి జరగబోవు దుష్ఫలితాలను నివారించుటకు, మంచి కలిగించుటకు, ధర్మాచరణములను పండుగగా ఆచరించడం నియమమైనది. మనస్సు మీద మంచి ప్రభావము ప్రసరించి పరమార్థము వైపు మనస్సును త్రిప్పుకొని మానసిక శాంతి పొందడానికి, ప్రకృతి వలన కలిగే అస్తవ్యస్త అనారోగ్యముల నుండి తప్పించుకొనుటకు, మంచి ఆరోగ్యాన్ని పొందడం కోసం శ్రావణ మాసంలో వచ్చే పండుగలలో నిర్దేశిరచిన ఆచారాలను పాటించడం ముఖ్యోద్దేశమైనది.

# రాజీనామా చేయాలని హరీశ్‌రావును అడిగితే నాటకాలాడుతున్నారు

## ఎంపీ చామల



హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రుణమాఫీ చేశామని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఎందుకు రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు. 2018లో మరోసారి రుణమాఫీ మాట ఇచ్చి మర్చిపోయారని విమర్శించారు. 2023 వరకు రైతులు వారికి గుర్తురాలేదని చెప్పారు.“భారాస హయాంలో మీరిచ్చిన రుణమాఫీ వడ్డీలకు కూడా సరిపోలేదు. రాజీనామా చేయాలని హరీశ్‌రావును అడిగితే నాటకాలాడుతున్నారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ప్రజలకు మీరు మంచి చేసి ఉంటే ఎన్నికల్లో భారాసను ఎందుకు ఓడించారు? మీ ప్రభుత్వంలో చీకటి జీవోలిచ్చి ఎంత కొల్లగొట్టారో తెలుసుకునేందుకే మాకు నెల రోజులు పట్టింది” అని చామల కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

# పట్నం మహేందర్ రెడ్డి తో శేరి సతీష్ రెడ్డి భేటీ



అభ్యుదయం – కూకట్ పల్లి (ఆగస్ట్ 17):- మేడ్చల్ మల్కా జిగిరి ఇంచార్జ్ పట్నం మహేం దర్ రెడ్డిని వారి నివాసంలో కూకట్పల్లి నియోజ కవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఫ్లవర్ బొకే అందజేశారు. ఈ సంద ర్భంగా పట్నం మహేందర్ రెడ్డి కూకట్పల్లి లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసు కున్నారు, ఇకపై అధికారిక కార్యక్రమాలు ఏమి జరిగినా ఇన్చార్జి మంత్రి మహేందర్ రెడ్డి, కూకట్ పల్లి ఇన్చార్జి బండి రమేష్ పాల్గొంటారని మహేందర్ రెడ్డి చెప్పారు.

# నిర్మాణంలో ఉండగానే మూడోసారి కుప్పకూలిన వంతెన

పట్నా: బిహార్ లో నిర్మాణంలో ఉన్న ఓ వంతెన కూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. బిహార్‌లోని ఖగారియా జిల్లాలో గంగా నదిపై అగువాని సుల్తాన్‌గంజ్ గంగా పేరుతో నిర్మిస్తున్న ఈ బ్రిడ్జ్‌లో ఓ భాగం ఒక్కసారిగా గంగానదిలో కూలిపోయింది.వంతెన కూలుతున్న సమయంలో అక్కడే ఉన్న స్థానికులు ఆ దృశ్యాలను రికార్డు చేశారు. ప్రస్తుతం ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ వంతెనకు ప్రమాదం జరగడం ఇది మూడోసారి. గతేడాది ఏప్రిల్‌లో తుఫాను కారణంగా వంతెన పిల్లర్లు కొంతభాగం కుప్పకూలిపోగా తిరిగి నిర్మాణం చేపట్టారు.దీని నిర్మాణం కోసం బిహార్ ప్రభుత్వం రూ.1,717 కోట్లు కేటాయించింది. 2015లో నీతీశ్‌కుమార్ ఖగారియా ప్రాంతాల మధ్య గంగా నదిపై ఈ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2020 నాటికి ఈ వంతెన నిర్మాణం పూర్తికావాల్సి ఉండగా ఇప్పటికీ పూర్తికాలేదు. ఒకే వంతెన నిర్మాణం పూర్తికాకముందే మూడుసార్లు కూలడంతో నిర్మాణంలో నాణ్యత, ప్రాజెక్టు అమరికపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయినిర్మాణంలో ఉన్న వంతెన మూడుసార్లు కూలిపోవడంతో ప్రతిపక్షాలు నీతీశ్ కుమార్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వం నిర్మాణం చేపడుతున్న ఎస్ కే సింగ్లా కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు జరిమానా విధించింది. వంతెనను సొంత ఖర్చుతో పునర్నిర్మించాలని ఆదేశించింది.2022 డిసెంబర్‌లో కూడా బిహార్‌లోని బెగుసరాయ్ ప్రాంతంలో బుర్హి గండక్ నదిపై నిర్మించిన వంతెనలో కొంత భాగం కూలిపోయింది. అదే ఏడాది నవంబరులో సీఎం నీతీశ్‌కుమార్ సొంత జిల్లా నలందలో నిర్మాణంలో ఉన్న వంతెన కూలిన ఘటనలో ఒక కూలీ చనిపోగా, మరో వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. అంతకుముందు కిషన్‌గంజ్, సహర్సా జిల్లాలో ప్రారంభానికి ముందే రెండు వంతెనలు కూలిపోయాయి.ఖ



# గోడ దూకి పార్లమెంట్ ప్రాంగణంలోకి.. దిల్లీలో కలకలం

దిల్లీ: పార్లమెంట్ లో మరోసారి భద్రతా వైఫల్య ఘటన కలకలం సృష్టిస్తోంది. ఓ యువకుడు పార్లమెంట్ గోడ దూకి లోపలికి చొరబడేందుకు యత్నించాడు.శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారిక వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం..నిన్న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో 20 ఏళ్ల వయసున్న ఓ యువకుడు ఇంతియాజ్ ఖాన్ మార్గ్‌వైపు ఉన్న గోడ దూకి పార్లమెంట్ అనెక్స్ భవనం పరిసరాల్లోకి ప్రవేశించాడు. అతడిని గమనించిన సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది వెంటనే అదుపులోకి తీసుకుని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నిందితుడి వద్ద ఎలాంటి ఆయుధాలు లేవని నిర్ధరించుకున్న తర్వాత అతడిని దిల్లీ పోలీసులకు అప్పగించారు.

### సహచరులే అఘాయిత్యానికి పాల్పడ్డారు

నిందితుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీశ్‌గా పోలీసులు గుర్తించారు. ఎత్తుగా ఉన్న గోడను అతడు ఎలా ఎక్కాడు? ఎందుకు పార్లమెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించాడన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి మానసిక పరిస్థితి సరిగా లేదని ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని తెలిపారు.

గతేడాది పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ లోక్‌సభ లోకి ఇద్దరు దుండగులు దూసుకొచ్చిన సంగతి తెలిసిందే. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగి 22 ఏళ్లు అయిన డిసెంబరు 13న ఆ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. లోక్‌సభలోని పబ్లిక్ గ్యాలరీ వద్ద కూర్చున్న ఇద్దరు యువకులు సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. రంగుల పొగను వదిలి భయభ్రాంతులకు గురిచేశారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల కూడా ఇద్దరు వ్యక్తులు ఇదే రకమైన నిరసనను చేపట్టారు. ఈ ఘటన తర్వాత పార్లమెంట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. సీఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించి భద్రతను పర్యవేక్షిస్తున్నారు.



# అమ్మాయిలు-అబ్బాయిలు మాట్లాడుకోవడం వల్లే..

## అత్యాచారాలపై దీదీ పాత వ్యాఖ్యలు వైరల్

జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళనలకు దిగారు.

మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వంపైనా పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల వేళ అత్యాచారాలపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గతంలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తాజాగా వైరల్‌గా మారాయి. అమ్మాయిలు, అబ్బాయిలు యథేచ్ఛగా మాట్లాడుకోవడం వల్లే రేప్ కేసులు పెరుగుతున్నాయంటూ నాడు ఆమె వ్యాఖ్యలు చేయడం గమనార్హం.2012లో కోల్‌కతాలోని పార్క్ స్ట్రీట్ ప్రాంతంలో ఓ యువతి కదులుతున్న కారులో సామూహిక అత్యాచారానికి గురైంది. ఇది అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై నాడు దీదీ స్పందిస్తూ.. “ఈ కాలంలో అమ్మాయిలు, అబ్బాయిలు స్వేచ్ఛగా మాట్లాడుకోవడం పెరుగుతోంది. గతంలో అమ్మాయి, అబ్బాయి ఒకరినొకరు చేయి పట్టుకుని కన్పిస్తే వారిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించేవారు. తల్లిదండ్రులు వారిని మందలించి సరిదిద్దేవారు. కానీ ఇప్పుడు అంతా ఓపెన్ అయిపోయింది. ఓపెన్ మార్కెట్ మాదిరిగా యువతకు అవకాశాలు ఉంటున్నాయి” అని వ్యాఖ్యానించారు.కోల్‌కతా ఘటన.. వైద్యుల బదిలీలను ప్రశ్నించిన భాజపాఇది అప్పట్లో తీవ్ర దుమారం రేపడంతో దీదీ తర్వాత వివరణ ఇచ్చుకన్నారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని మండిపడ్డారు. తాజాగా కోల్‌కతా హత్యాచార ఘటన వేళ నాటి మమతా బెనర్జీ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఇలాంటి సీఎం హయాంలో న్యాయం దక్కుతుందని ఆశిస్తున్నారా? అంటూ కొందరు



నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు.ఇదిలా ఉండగా.. హత్యాచార ఘటన వేళ రాష్ట్రంలో 42 మంది వైద్యులను ప్రభుత్వం బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. మరోవైపు ఆ దారుణ ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. హత్యాచారం చోటుచేసుకున్న ఆర్‌జీ కార్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను సీబీఐ వరుసగా రెండో రోజు విచారించింది.

# కాంగ్రెస్‌వన్నీ డైవర్ట్ పాలిటిక్స్

### కెటిఆర్ వ్యాఖ్యలపై కావాలనే రాజకీయం

### అత్యాచారాలపై మహిళామంత్రుల స్పందన ఏదీ

### ఘాటుగా స్పందించిన బిఆర్ఎస్ మహిళా నేతలు

హైదరాబాద్,ఆగస్ట్17 అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్ నడుపుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై బీఆర్ఎస్ మహిళా నేతలు తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. కేటీఆర్, హరిష్ రావులు టార్గెట్‌గా కాంగ్రెస్ చేస్తున్న కామెంట్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం నాడు ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవిలు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. తొలుత సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ వ్యాఖ్యలపై కావాలనే రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. పొరపాటున మాట్లాడానని హుందాగా మహిళలకు క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. కేటీఆర్ సంస్కారం గురించి కేసీఆర్‌పై మంత్రి సీతక్క మాట్లాడుతున్నారని.. కేసీఆర్ నేర్పించిన సంస్కారం ఏంటో కేటీఆర్ చెప్పిన క్షమాపణతో అర్థం అవుతోందని సబిత కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో విద్యార్థులు, మహిళలపై జరుగుతున్న హత్యాచారాలపై మహిళా మంత్రులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారామె. షాద్‌నగర్ ఘటనపై మహిళా కమిషన్ ఎందుకు స్పందించడం లేదని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీలో తమపై ముఖ్యమంత్రి చేసిన కామెంట్స్‌పై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. పొరపాటున మాట్లాడానని ముఖ్యమంత్రి కనీసం మాటనైనా చెప్పకుండా రాక్షసానందం పొందారని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు.

సంస్కారవంతులు ఎవరో.. సంస్కారం హీనులు ఎవరో ప్రజలు చూస్తూనే ఉన్నారన్నారు. సీతక్క మీద సోషల్ మీడియా ట్రోల్స్‌పై స్పందించిన సీఎం.. తమపై చేసిన కామెంట్స్‌పై ఎందుకు స్పందించలేదని సబిత ప్రశ్నించారు. కేటీఆర్‌పై మాటల దాడి.. హరీష్ రావు క్యాంప్ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నామన్నారు సునీతా లక్ష్మారెడ్డి. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఇద్దరూ నిలదీసినందుకే వారిపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. మహిళల విషయంలో కేటీఆర్ మాట దొర్లడంతో సారీ కూడా చెప్పారన్నారు. రాజకీయ లబ్ధి కోసం మహిళా మంత్రులు, కాంగ్రెస్ నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో కౌశిక్ రెడ్డితో సీతక్కకు సారీ చెప్పించామని గుర్తు చేశారు. కానీ, అదే అసెంబ్లలో తమను అవమానించిన సీఎం కనీసం క్షమాపణ చెప్పలేదని విమర్శించారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. హరీష్ సవాల్‌తోనే రైతులకు రుణమాఫీ చేశారన్నారు. పూర్తి రుణమాఫీ చేయకుండానే చేశామని చెబుతున్నారని దుయ్యబట్టారు. మహిళా కమిషన్ సుమోటోగా తీసుకో వాల్సిన అంశాలు చాలా ఉన్నా యన్నారు. మహిళా భద్రత, షీ టీమ్స్ ఎక్కడ పోయాయని ప్రశ్నించారు.

ముందుగా మహిళల రక్షణపై శ్రద్ధ పెట్టండని ప్రభుత్వాని హితవు చెప్పారు సునీతీ లక్ష్మారెడ్డి.కాంగ్రెస్ నేతలు డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ వాణి దేవి విమర్శించారు. మహిళ విషయంలో కేటీఆర్ పొరపాటుగా కామెంట్స్ చేశారని.. ఆ వెంటనే క్షమాపణలు కూడా చెప్పారని గుర్తు చేశారు. ఏ మన్గి÷నా తప్పులు చేస్తారని.. దొర్లిన తప్పులకు హుందాగా కేటీఆర్ క్షమాపణలు చెప్పారన్నారు. చిన్న విషయాలను పెద్దగా చేయొద్దని కాంగ్రెస్ నేతలకు వాణి దేవి హితవు చెప్పారు. హరీష్ రావు ఇంటిమీద దాడి చేయడం ఏంటి? అని కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డారు. చిల్లర రాజకీయాలు మాని.. విద్యారంగ సమస్యలు పట్టించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
ఆదివారం 18 ఆగస్టు 2024

## పండగకు పిల్లలని ఇంటికి పంపడం లేదని తల్లిదండ్రులు నిరసన

జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపిన తల్లిదండ్రులు



మెట్ పల్లి, ( మన వెలుగు ) ఆగస్టు 17 :
రాఖీ పౌర్ణమి సందర్భంగా పిల్లలను ఇంటికి తీసుకువెళ్లాడానికి వచ్చిన తల్లిదండ్రులను నిరాశే ఎదురైంది. తమ పిల్లలను ఇంటికి పంపడం లేదని పట్టణ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ముందు జాతీయ రహదారి పై విద్యార్థుల తల్లిదండ్రులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.రాఖీ పండగ సందర్భంగా విద్యార్థులను ఇంటికి పంపించడం లేదని ప్రిన్సిపాల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా తల్లితండ్రులు మాట్లాడుతూ.. రాఖీ పండగకి మాత్రం పిల్లలను ఇంటికి పంపమని అడిగితే పంపించడం లేదన్నారు. రోడ్డు పై విద్యార్థుల తల్లితండ్రులు బైటయించడంతో రహదారి పై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు విద్యార్థుల తల్లిదండ్రులతో, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తో మాట్లాడి పండగకు పిల్లలను ఇంటికి పంపేందుకు ఏర్పాటు చేశారు.

## రుణమాఫీ చేయడం లేదని రైతుల ఆందోళన



మెట్ పల్లి, ( మన వెలుగు ) ఆగస్టు 17 : జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం వెంపేట కెనరా బ్యాంక్ ఎదుట రైతులు రుణమాఫీ చేయడం లేదని శనివారం రైతులు ఆందోళన నిర్వహించారు.జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలంలోని వెంపేట, మల్లాపూర్ మండలంలోని ధర్మారం,

సాతరం, చిట్టపూర్, చింతలపేటతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులకు రుణమాపి చేయడం లేదని నిరసన వ్యక్తం చేశారు. మొదటి విడత రుణమాఫి నుంచి ఇప్పటివరకు తమకు ఒక్క రూపాయి కూడా రుణమాఫి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ అధికారులను వివరణ కోరగా టెక్నీకల్ సమస్యతో ఇబ్బంది వచ్చిందని తెలిపారు. అధికారులు తొందరగా స్పందించి రుణమాఫి చేయించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు.

## వైద్యురాలిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి




కరీంనగర్, ( మన వెలుగు ) ఆగస్టు 17 : కోల్ కత్తలో ఆర్జికెఆర్ మెడికల్ కళాశాలలో యువ డాక్టర్ మహిళపై హత్యాచారం చేసిన దుండగులను తక్షణమే కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి తిరుపతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మంకమ్మ తోట డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ... కోల్ కత్తలో యువ మహిళ డాక్టర్ పై హత్యాచారం చేసిన దుండగులను తక్షణమే శిక్షించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే దుండగులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఒక మెడికల్ కళాశాలలోనే ఇటువంటి సంఘటన జరగడం చాలా దురదృష్టంకరమని ఆయన అన్నారు. దేశంలో రోజురోజుకు మహిళలకు భద్రత కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతు న్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిఘవర్గాలు ఎప్పటికప్పుడు వీక్షించి ఇటువంటి సంఘటనలు పునరా వృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. దేశంలో మహిళలపై అగత్యాలు హత్యాచారాలు జరగకుండా జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో దేశంలో మహిళలపై అత్యాచారాలు అగత్యాలు జరగకుండా సెమినారు సదస్సులు ఇంజనీరింగ్ మెడికల్ కళాశాలలో డిగ్రీ కళాశాలలో సదస్సులు నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి లక్పతి నాయక్ నాయకులు అజయ్ రాజు రాజేందర్ వంశీ కృష్ణ అభిలాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ విషయంలో రైతాంగాన్ని కాంగ్రెస్ సర్కార్ మోసం చేసింది

- దేవుళ్ళ మీద ఒట్టు పెట్టుకుని కూడా మాటమీద నిలబడలే
- గోరంత రుణమాఫీ చేసి కొండంత ప్రచారం చేసుకుంటుంది
- రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దమ్ముంటే రుణమాఫీ పై శ్వేత పత్రం విడుదల చేయాలి
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



జమ్మికుంట, ( మన వెలుగు ) ఆగస్టు 17 :
రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందని,దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకొని కూడా మాట మీద నిలబడలేదని, గోరంత రుణమాఫీ చేసి నిస్సిగ్గుగా కొండంత ప్రచారం చేసుకుంటుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. శనివారం జమ్మికుంటలో స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి నిర్వహించిన సమావేశంలో రైతు రుణమాఫీ అంశంపై మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియా గాంధీ పుట్టిన రోజు కానుకగా డిసెంబర్-09 నాటికి 40వేల కోట్ల రూపాయల రైతు రుణ మాఫీ ఏకకాలంలో చేస్తాన్నన్న రేవంత్ రెడ్డి మాట మీద నిలబడలే దన్నారు. డిసెంబర్-09న రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెర వేర్చలేక పార్లమెంట్ ఎన్నికల ముందు మరో నాటకానికి తెరలేపిందని, . ఆగస్టు-15తేదీ వరకూ 31వేల కోట్లు మాఫీ చేస్తానని ఎన్నికలలో ఊదరగొట్టి, 9వేల కోట్లు కోత పెట్టిండ న్నారు. రుణమాఫీ విషయంలో ఎవరూ నమ్మడం లేదని ప్రతి ఊరి దేవుడి మీద ప్రమాణాలు చేసిండని. సోనియా మీద ఒట్టు పెట్టినా, దేవుళ్ల మీద ఒట్టు పెట్టినా అబద్దమే నా లక్షణం, మోసమే నా విధానం, మాట తప్పడమే నా నైజం అనే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నిజస్వరూపాన్ని బట్టబయలు చేసుకున్నడని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రెండు లక్షల రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది రైతులే ఉంటరా, రూ. 17,869 కోట్లు మాత్రమే అవుతాయా, ఈ ఒక్క విషయంతోనే మీ రుణమాఫీ పచ్చి అబద్దమాని తేలిపోతున్నదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని దగా చేశారనన్నది స్పష్టంగా తేలి పోయిందన్నారు. రేవంత్ రెడ్డి రైతు ద్రోహానికి మాత్రమే కాదు.. దైవ ద్రోహానికి పాల్పడ్డారని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండి దేవుళ్ల మీద ఒట్టుపెట్టి.. మాట తప్పిన రేవంత్ రెడ్డి చేసిన అపచారానికి వెంటనే ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే వెంటనే రుణమాఫీపై శ్వేత పత్రం విడుదల చేయాలని ,అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు,హుజురాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి,జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్,సింగిరెడ్డి తిరుపతి రెడ్డి,కట్కూరి అశోక్ రెడ్డి,బండి కోటేశ్వర్,గుర్రం సంతోష్,తూర్పాటి భాస్కర్,బండి సంపత్ రాణా ప్రతాప్, వడిగే రాకేష్,మామిడి విజయ్ అడేపు వినయ్ కుమార్, వెంకటేష్, దేవేందర్, రాము,రాజు,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థినిని హత్యాచారం చేసి చంపిన హంతకులకు ఉరితీయాలి

ర్యాలీ చేపట్టిన డాక్టర్ లు, విద్యార్థులు, లాయర్ లు, వివిధ పార్టీ నాయకులు

వివాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేసిన డాక్టర్ లు, లాయర్ లు, విద్యార్థులు,వివిధ పార్టీ నాయకులు









మెట్ పల్లి, ( మన వెలుగు ) ఆగస్టు 17 :
కోల్ కత్తా ఆర్జికేఆర్ వైద్య కళాశాలలో, పిజి విద్యార్థినిని అత్యాచారం చేసి చంపిన ఘటనపై జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, మెట్ పల్లి డాక్టర్ లు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. 24 గంటలు వైద్య సేవలు నిలిపి భారీ ర్యాలీ చేపట్టారు. మెట్ పల్లి మండల పరిషత్ సమావేశం నుండి డాక్టర్ లతో పాటు సిబ్బంది కలిసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వీరికి మద్దతుగా లాయర్లు, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులతో పాటు మెడికల్ అసోసియేషన్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాఠశాలల విద్యార్థులు మద్దతు తెలిపారు. కొత్త బస్టాండ్ నుండి బయలుదేరిన ఈ ర్యాలీ, పాత బస్టాండ్ మీదుగా ఆర్డిఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వరకు చేరుకుంది. అక్కడ ఆర్డిఓకు, ఎస్ఐకి డాక్టర్లు వినతి పత్రాలను అందించారు. అనంతరం వైద్యులు మాట్లాడారు. పి జి విద్యార్థిపైన జరిగిన ఘటన హేయమైన చర్యగా భావించారు. ఈ ఘటనలో రాజకీయ నాయకుల కొడుకుల హస్తం ఉందని ఆరోపించారు. మెడికల్ విద్యార్థి మృతికి కారణమైన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటన చాలా దురదృష్టకరమన్నారు. నిజమైన నిందుతులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పెద్దపెల్లి, ( మన వెలుగు ) ఆగస్టు 17 :
రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదేనని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు.సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్ లో శనివారం సుల్తానాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారు అనారోగ్యం కారణంగా వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందగా వారికి అయినటువంటి ఖర్చులకు సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వారికి రూ.60,00,000/- లక్షల విలువ గల 236 సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న నిరుపేదల కోసం స్వయంగా నేనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసి పెద్దపల్లి నియోజకవర్గానికి సంబందించిన సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఎన్నికల ముందు వరంగల్ డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ 2 లక్షల రుణమాఫీ ప్రకటించారని ఎన్నికల హామీ కట్టుబడి ఉండి రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నారని అన్నారు. ఆగస్టు 15న రైతులకు పూర్తి స్థాయిలో రెండు లక్షల రుణమాఫీ చేసి చూపించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రైతు రుణమాఫీని చూసి బిఆర్ఎస్ నేతలు అసత్యపు ప్రచారాలు చేస్తున్నార న్నారని.బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు రుణమాఫీ ఎక్కడ జరిగిందో బిఆర్ఎస్ నేతలు చూపెట్టాల న్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్లో సన్న వడ్లు వేసుకున్న రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం 500 బోనస్ చెల్లిస్తుందని అన్నారు. ఎన్నికల హామీ ఇచ్చిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల వారిగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని అన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆదరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
ఆదివారం 18 ఆగస్టు 2024

# అటవీ భూముల్లో సాగులో ఉన్న గిరిజనులతో పాటు గిరిజనేతరులకు పోడు పట్టాలు ఇవ్వాలి

- టైగర్ జోన్ పరిధిలో భారీ వాహనాలకు అనుమతులివ్వాలి
- అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సదుపాయాలు కల్పించేందుకు అనుమతులు ఇవ్వాలి
- గిరి వికాసం కింద చేపట్టిన బావులకు త్రీ పేస్ కరెంట్ ఇవ్వాలి
- రాష్ట్ర అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ నిర్వహించిన జూమ్ మీటింగ్ లో కోరిన ఖానాపూర్ ఎమ్మెల్యే






ఉట్నూర్, ( మన వెలుగు ) ఆగస్టు 17 :
అటవీ భూముల్లో సాగు చేసుకొంటున్న గిరిజనులతో పాటు గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇవ్వాలని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ భోజ్జు పటేల్ రాష్ట్ర అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు.శనివారం హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రి నిర్వహించిన జూమ్ మీటింగ్ లో ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ పాల్గొని నియోజకవర్గంలో నెలకొని ఉన్న అటవీ శాఖ సమస్యలను మంత్రి కి వివరించారు.గిరిజనుల పోడు భూముల సమస్య ఇంకా పరిష్కారం కాలేదని,అనేక మంది గిరిజన రైతులకు పోడు పట్టాలు అందలేదని వివరించారు. గిరిజనేతర రైతులు కూడ అటవీ భూముల్లో సాగులో ఉన్నారని వారికీ కూడ పోడు పట్టాలు ఇచ్చే విషయంలో సాధ్య సాధ్యలను పరిశీలించాలని కోరారు. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో భారీ వాహనాల ప్రవేశాన్ని నిషేదించారని దీంతో వ్యాపార, వాణిజ్య రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. భారీ వాహనాలను అనుమంతిచక పోవడంతో సరుకులు తరలింపులో వ్యాపారాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని అన్నారు.ప్రజా అవసరాల దృష్ట్యా మంచిర్యాల నుంచి నిర్మల్ వరకు, ఉట్నూర్ నుంచి మంచిర్యాల వరకు భారీ వాహనాల ప్రవేశానికి ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ కోరారు.అటవీ ప్రాంతంలో ఉన్న మిద్దె చింత, ధర్మాజీ పేట్, రాగి దుబ్బ గ్రామాలలో విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో మగ్గుతున్నాయని,ఆ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు ప్రయత్నిస్తే అటవీ శాఖ అధికారులు అడ్డుకొంటు న్నారని,ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి ఆ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం అందే విధంగా అటవీ శాఖ సహకరించా లని ఎమ్మెల్యే కోరారు.గిరివికాసం పథకం కింద గిరిజన రైతులకు వ్యవసాయ బావులు అందించామని కానీ ఇంతవరకు త్రీ పేస్ కరెంట్ ఇవ్వకపోవడంతో వ్యవసాయ బావులు నిరూపయోగంగా మారాయని వ్యవసాయ బావుల్లో పుష్కళంగా నీరున్న కరెంట్ లేకపోవడంతో బావుల నీరు వ్యవసాయానికి మల్లించుకోలేక పోతున్నారని వారికి త్రిపేస్ కరెంట్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
ఈ జూమ్ మీటింగ్ లో పంచాయతీ రాజ్ శాఖ, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్కతో పాటు ఎమ్మెల్యేలు, కలెక్టర్ లు,అటవీ శాఖ ఉన్నతధికారులు పాల్గొన్నారు.

## కోల్‌కత్త డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలని నిరసన




ఇచ్చోడ, ( మన వెలుగు) ఆగస్టు 17 :
ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో కోల్కతాలో మహిళా డాక్టర్ పై అత్యాచారం అంతకు నిరసనగా... ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి రోడ్డు వరకు నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న 24 గంటలు దేశవ్యాప్తంగా ఓపి సేవల ఉపసంహరణకు మద్దతు తెలిపారు.ఇచ్చోడ పిహెచ్సి డాక్టర్ కిరణ్ కుమార్,మెడికల్ ఆఫీసర్ , డాక్టర్ శ్రీకాంత్, ఎం.ఎల్.హెచ్.పి. ప్రశాంత్, ఆరోగ్య సహాయకులు సుబాష్, రాజ్‌కిరణ్, కైలాష్, రాజుబాయి, స్టాఫ్ నర్సులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూముల సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్

**పాల్గొన్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, బోథ్ ఎమ్మెల్యే, జిల్లా అటవీ శాఖ అధికారి**





ఆదిలాబాద్, ( మన వెలుగు ) ఆగస్టు 17 :
పోడు భూముల సమస్యల పరిష్కారం పై అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి సీతక్క తో కలసి అరణ్య భవన్, హైదారాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా పాలనాధికారి రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, బోథ్ ఎంఎల్ఏ అనిల్ జాదవ్, డిఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటెల్, పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోడు భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ప్రణాళిక రూపొందిం చుకొని గతంలో దరఖాస్తు చేసుకున్న వాటిని మాత్రమే పరిష్కరించడం జరుగుతుందని, సాగుచేస్తున్న పోడు భూముల హద్దులు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. అనర్హులు అటవీ భూములను ఆక్రమించు కోకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అటవీ, గిరిజన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## హోరెత్తిన వైద్యుల నిరసన



కోల్‌కతా ఆర్‌జీ కార్ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనను తీవ్రంగా నిరసిస్తూ రాష్ట్రంలోని వైద్య సంఘాలు శనివారం భారీఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు హైదరాబాద్ లోని కార్పొరేట్, పెద్దాసుపత్రులతో పాటు ప్రభుత్వ బోధనాస్పత్రులు, జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఔట్ పేషెంట్ సేవలను నిలిపివేశారు.అత్యవసర సేవలను మాత్రం అందించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది రోడ్లపైకి వచ్చి నల్లబ్యాడ్జీలతో ర్యాలీలు నిర్వహించారు.
వీరికి, పారా మెడికల్ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, మెడికల్ రిప్రజంటేటివ్‌లు మద్దతు ప్రకటించారు. హత్యాచారానికి పాల్పడ్డ నిందితులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐఎంఏ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద వైద్యుల నిరసనలో నగరంలోని అన్ని ఆస్పత్రులకు చెందిన వందలమంది వైద్యులు, జూనియర్ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి, వరంగల్ ఎంపీలు ఈటల రాజేందర్, డాక్టర్ కడియం కావ్య మద్దతు ప్రకటించారు. ఐఎంఏ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ పి.కాళీప్రసాదరావు ఆధ్వర్యం వహించారు.

# కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

**విధులు బహిష్కరించి నిరసనలు..ధర్నాలు- కేవలం ఎమర్జెన్సీ కేసులు మాత్రమే హాజరు**




న్యూఢిల్లీ,ఆగస్ట్17 కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన దేశ వ్యాప్తంగా కాకరేపుతోంది. కోల్‌కతాలో జరిగిన ఘటనపై దేశంలో వైద్యులంతా ఏకతాటిపైకి వచ్చారు. గతంలో ఏవైనా ఘటనలు జరిగేటప్పుడు స్వరాష్ట్రంలో మాత్రమే నిరసనలు జరిగేవి. తీవ్రత ఆధారంగా దేశ వ్యాప్తంగా నిరసన గళం వినిపించేది. ప్రస్తుతం కోల్‌కతా ఘటనపై ప్రతి ఒక్కరూ న్యాయం కోసం నినదిస్తున్నారు. దేశంలో వైద్యులంతా ఐక్యమై రోడ్డెక్కారు. ముందు తమ ప్రాణాలకు రక్షణ కల్పిస్తే.. తాము రోగుల ప్రాణాలు కాపాడతామంటూ వైద్యులు నినదిస్తున్నారు. మరోవైపు పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నా యి. ఓవైపు సీబీఐ విచారణ కొనసా గుతుండగా.. త్వరగా విచారణ పూర్తిచేసి. .నిందితులను కఠినంగా శిక్షించాలంటూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సైతం నిరసనల్లో పాల్గొన్నారు. మమతా బెనర్జీ రాజీనామా చేయాలని పశ్చిమబెంగాల్ బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు ఈ ఘటనలో నిందితులందరిని తక్షణమే అరెస్ట్ చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం కేసులో ఆసుపత్రిలోని కొందరు వైద్యులు, సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ ఘటనపై తెలుగు రాష్టాల్లో్ వైద్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), ఫ్యాకల్టీ అసోసియేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ దేశశ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా శనివారం 24 గంటలపాటు వైద్య సేవల బంద్ చేయాలని నిర్ణయించాయి వైద్య సంఘాలు. అత్యవసర సేవలు మినహా అన్ని ఆరోగ్య సేవలు, సాధారణ సేవలు శస్త్రచికిత్సలు శనివారంఉదయం 6 నుండి ఆదివారం ఉదయం 6 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపింది. డాక్టర్లు కేవలం ఎమర్జెన్సీ కేసులను మాత్రమే అటెండ్ అవ్వాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వెల్లడిం చింది. ఐఎంఏ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఓపీ సేవలు నిలిచిపోయాయి.

ఈ సమ్మెకు దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, మెడికల్ సిబ్బంది సైతం తమ సంఘీభావం ప్రకటించి ఓపీ సేవలను నిలిపివేశారు.ఈ క్రమంలో ఓపీ సేవలు నిలిచిపోవటంతో దేశవ్యాప్తంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నిరసన ద్వారా వైద్యులు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు.వైద్యులకు కేంద్ర రక్షణ చట్టం అమలు చేయాలని, కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో బాధితురాలికి తక్షణ న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నారు .సెక్యూరిటీ ఆడిట్, సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అందుబాటులో ఉండేలా చూడాలని, ఆసుపత్రిలో అమర్చిన కెమెరాల పూర్తి నివేదిక ఇవ్వాలని డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం వైద్య సేవలను నిలిపివేస్తుంటారు. కానీ కోల్‌కతా ఘటనపై ప్రయివేట్ ఆసుపత్రుల వైద్యులు 24 గంటల పాటు ఓపీ సేవలను నిలిపివేశారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు తెలంగాణలో అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ సేవలు నిలిచిపోతాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తోంది. కోల్‌కతా ఘటన అత్యంత హేయమని, బాధ్యులను ఇప్పటిరవకు గుర్తించకపోవడం, వైద్యులకు తగిన భద్రత, రక్షణ లేకపోవడం అన్యాయమని ఐఎంఏ నాయకులు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు మాత్రమే అందుబాటులో ఉంటా య న్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్‌లోని ధర్నాచౌక్‌లో ఐఎంఏ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

తెలంగాణ వ్యాప్తంగా పలు పట్టణాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన ప్రదర్శనలు చేశారు. కోల్‌కతా ఘటనపై సీబీఐ విచారణను వేగవంతం చేసి నిందితులందరినీ అరెస్ట్ చేయాలని వైద్య సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఐఎంఏ పిలుపుతో శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు ఓపీ సేవలను నిలిపి వేస్తున్నట్లు రాష్ట్రంలోని ప్రధాన కార్పొరేట్ ఆసుపత్రులు ప్రకటించాయి. అపోలో, కిమ్స్, స్టార్, యశోద, రెయిన్‌బో, కిమ్స్-సన్గ్÷న్ ఆసుపత్రులు సహా వివిధ ఆసుపత్రుల్లో 24 గంటలపాటు ఓపీ ఉండబోదని, ఎమ్జ్గ÷న్సీ సేవలు అందిస్తామని వెల్లడించాయి.